అనుమానం

"ఇంత పొద్దుకూకేదాక ఎక్కడ మంత్రాంగం చేస్తున్నావ్?"

"మంత్రాంగం ఏమిటండీ... మరీను! పక్కింటి పార్వతమ్మగారింట్లో మంగళవారం నోమంటే పేరంటాన్కి వెళ్ళాను. ముత్తయిదువులు రావటం కొంచెం ఆలస్యమయింది..."

"నోర్ముయ్యి! పేరంటాన్కి వెళ్ళావా? పెద్దగంగలో స్నానాన్కి వెళ్ళావా?... వాళ్ళింటికి వెళ్ళవద్దని మొన్ననేగా చెప్పాను. వాళ్ళ గుమాస్తా మాధవరావు మంచివెధవ కాదని, వాళ్ళింటి ఛాయలకేపోవద్దని చెప్తున్నానా?.... ఆ వెధవ ఎనిమిదింటిదాక అక్కడే పడి కొంగచూపులు చూస్తూ కూర్చుంటాడు. అప్రతిష్ఠ తెస్తావాయేమే...?"

"నేను రానన్నే చెప్పానండీ! ఇంటిల్లిపాదీవచ్చి బ్రతిమాలి బామాలి తీసుకుపోయారు... ఇక వెళ్ళనులెండి. అన్నంలోకి ఏమి చెయ్యమన్నారు?"

"ఏదో తగలెయ్యి- నాకాకలిలేదు."

"ఈమాత్రం దానికి అంతగా యిదవుతారెందుకండి? వాళ్ళ కుటుంబం అటువంటిది కాదండి. ఆ గుమాస్తాతో మనకెందుకు?"

"ఆఁ! నీకు తెలిసేదుసు. నా బొంద, నీకామాత్రం తెలివితేటలుంటే నాకీమనస్సులో బాధ ఎందుకు? నీది చవిటి బుర్రకాబట్టే నా యీ గోల. ఆ కూతుర్కి ఇంకా పెళ్ళి పెటాకులు లేవు. ఆ కోడల్ని నానా అల్లరి పెట్తారు ఇంట్లో. కూతురొక జాణ. అది గేటుదగ్గరేగాని ఇంట్లో నుంచోదు. పెళ్ళయినా కాపరం చేసే ఘటంగా లేదు..."

"ఆ గొడవంతా మనకెందుకులెండి- స్నానం చెయ్యండి. చిన్నవాటికి కూడా తీవ్రంగా వ్యాకులపడటం ఎందుకు?"

ఈ సంభాషణయ్యాక అన్నం దగ్గర కూర్చున్నాడన్నమాటేగాని సుందరానికి ముద్ద సరిగా పోనేపోలేదు.

మామూలుగా పది గంటలకే నిద్రపోయేవాడు. పదకొండయినా కునుకే రాలేదు సుందరానికి. బుర్ర అంతా వేడెక్కి పోతోంది ఆలోచన్లతో. ఆలోచనే వద్దని ఎన్నిమార్లు అనుకున్నా పరుగు పరుగుతో మరి నాలుగు ఉప ఆలోచన్లని వెంటబెట్టుకు వస్తున్నాయి. ఎంత ఆలోచించినా, ఎంతగా న్యాయపరిశీలన చేసినా, ఎన్ని ప్రశ్నలు వేసుకొని జవాబులు చెప్పుకున్నా, ఎటువంటి సంఘటనలు గుర్తు

తెచ్చుకున్నా, తన భార్య వనజ ఎటువంటిదో తేలలేదు. 'అమాయకురాలా, లోకం సంగతి బాగా తెలిసిందేనా, వేరే అభిరుచులున్నాయా? తాను చెప్పింది ఒప్పుకుందే- ఇక వాళ్ళింటికి వెళ్ళనందే- తనంటే ఎంతో ప్రేమగా వుంటుంది! సమస్తమైన సౌఖ్యాలని చేకూరుస్తుందే- చక్కగా అలంకరించుకొని నవ్వుతూ లక్ష్మీదేవిలా పలకరిస్తుందే తను వచ్చేటప్పటికి. తాను నిద్రపోయేవరకు పాదసేవ కూడా చేస్తుందే. ఇంట్లో వున్నంతసేపు కిలకిలా నవ్వుతో ఆనందాన్ని మూర్తీభవింపజేస్తుందే. తానేమంత అందగాడని అంత ప్రేమ కనువరుస్తుంది? ముఖం నలుపు. నుదురుమీద పెద్ద మచ్చ- నోరు సిగరెట్టుకంపు- కాని వీటిని ఏమాత్రం గుర్తించినట్లుండదే- ఎందుకీ అనుమానం అన్యాయంగా? రెండేండ్లన్నా కాపురం చెయ్యకముందే అలాంటి బుద్ధులు పుట్తాయా? ఛా- పాడు అనుమానం- వనజ సాత్వికురాలు- ధార్మికురాలు- అమాయకురాలు- ఇదేం ఆలోచన? ఆఫీసులో వచ్చే నిద్ర ఇప్పుడు రాకూడదూ' అని ఎవ్వో భావాలు పరుగెత్తుతున్నాయి సుందరం మనస్సులో. ఎంత ప్రయత్నించినా కళ్ళు మూతపడటం లేదు. ఆలోచన్లు యింకా తిరుగు ముఖం పట్టలేదు.

'పక్కింటి ప్లీడరు ధర్మారావుగారి గుమాస్తా మాధవరావు వొఠ్ఠి పోకిరీ, వెధవ షోకూ వీడూను. అయినా వాడిని అనటం ఎందుకు? దేవుడు అందం ఇచ్చాడు. ఇస్తే మటుకు ఇంత అదిరిపాటా? లాల్చీలు, నల్లద్దాల కళ్ళజోడు, పెద్ద యాక్టరు మాదిరి తయారవుతాడు. ఎంత నికారసైన ఆడదైనా కనీసం రెండుసార్లయినా వాడిని చూసి తీరుతుంది కంటబడితే. వాడి వేషం- వాడి చూపూ చూస్తుంటే ఆడవాళ్ళంటే వెంటబడే ముఖంలాగానే వుంది. అందుకనే వనజను వాళ్ళింటికి తరచు పోవద్దంటాను నేనడమే గాని వనజ అదపా దదపా వెళ్తూనేవుంటుంది. వనజ మాత్రం ఆడదికాదా? కళ్ళు లేవా? అందులో అందంగల వాడిని చూడాలని ఆశకూడా ఒక మూల వుండొచ్చు... వాడు మట్టుకు కోర్టుకు గాడిదలాగా కట్ట మోసుకుపోతూ మా వంటయింట్లో వరకు గద్దమాదిరి చూపు సారిస్తూ పోతాడు. మొన్న పిలిచి వ్యంగ్యంగా నాలుగు రానిద్దామనుకున్నా- కాకపోయినా వాడిని అనడం దేనికి? దీనికి బుద్ధి వక్రత పొందకుండావుంటే బాగానే వుంటుంది. వాళ్ళ గడప త్రొక్కవద్దంటే వింటేనా? పేరంటం, గీరంటం. ఏదో వంక, ఆ వెధవనిచూసి ముసిముసి నవ్వులు నవ్వేందుకు-

ఏమైనా వనజలో కూడ కొంత వుండొచ్చు- అందుకనే కాబోలు నన్ను మభ్యపెట్టటానికి సినిమాలో యాక్టు చేస్తున్నట్లు నామీద ప్రేమ వలకపోస్తుంది. గడుసు బుఱ్ఱ వనజ. నిన్న మట్టుకు- నిన్న నాకు అన్నం కంచంలో పెట్టి గోడ దగ్గర కబుర్లకి పోయింది. బహుశః ఆ వెధవే వచ్చి వుంటాడు అక్కడికి. 'నెయ్యి నెయ్యి' అని అరిస్తే అప్పుడొచ్చి 'పిన్నిగారు పిలిస్తే మాట్లాడుతున్నా' అని సర్ది చెప్పింది. పిన్నిగారా- పిడకగారా? నిజం నిలకడమీద తెలియకపోతుందా?... నా గౌరవాన్ని గోతిపాలు చేస్తుందా ఇది? నా ప్రాణం వుండగా సహించను. నిజంగా

మా ఆరుకొలనులో మా వంశం అంటే ఎంతో యిదవుతారు వూరంతా. వనజని ఇప్పుడే అదుపాజ్ఞల్లో పెట్టాలి. లేకపోతే వంశనాశనం... చూద్దాం. కచ్చితంగా ఏ విషయం తెలుసుకోకుండా ఎందుకు ఈ అనుమానం?'

గోడ గడియారం ఒంటి గంట కొట్టింది. సుందరం ఇంక ఆలోచించలేక పోయాడు. క్రమక్రమంగా నిద్ర ఆవహించింది.

తర్వాత మంగళవారంనాడు ఏదో సాకుచెప్పి పేరంటానికి వెళ్ళలేదు వనజ. ఆపైది ఆఖరువారం. మామూలుగా పిలిచి వెళ్ళారు. మళ్ళా మధ్యాహ్నం కబుర్లు చెప్పుకునేందుకు వచ్చిన పార్వతమ్మ, కూతురు చాల యిదిగా చెప్పారు. కోడలు చాలా ప్రాధేయపడింది - "ఆఖరువారం కూడా రారా" అని. రాకపోయేందుకు కారణం నిజం చెప్పితే వూరూ వాడా పొక్కిపోతుంది. పేరంటం మానితే పొరుగు పొత్తు పోతుంది. వీలు చూసుకుని వస్తానని ఒప్పుకుంది.

సుందరం బి.ఏ. ప్యాసయినా కొన్ని విషయాల్లో మూర్ఖపు పట్టు గలవాడు. అందులో భార్యమీద అనుమానం తగిలితే మగవాడు మహిషం అయిపోతాడు ఆ ఉద్రేకంలో. వనజకు రెండు విధాల పెద్ద చిక్కే వచ్చింది. అయిదుగంటలు దాటితేగాని భర్త యింటికి రాడనే ధైర్యంతో నాలుగు గంటలకి వెళ్ళి వెంటనే వాయనం పుచ్చుకొని వచ్చేద్దామని నిశ్చయం చేసుకుంది వనజ.

ఆఫీసుకు వెళ్ళాడేగాని సుందరం మనస్సంతా ఇంటి దగ్గరే వుంది. తన భార్య పార్వతమ్మగారింటికి వెళ్తుందేమో ఆ వెధవని చూసేందుకనే అనుమానం లోపల బాధపెట్తోంది. అయినా చూద్దాం అని నాలుగు గంటలకే పర్మిషన్ తీసుకొని ఇంటి ముఖం పట్టాడు సుందరం. అనుమానం చెవులో దూరిన జోరీగలాంటిది.

అప్పుడే ఇల్లు తాళం వేసి వనజ పేరంటానికి వెళ్ళింది. ఇంటికి వచ్చి తాళం వేసి ఉండటం చూశాడు సుందరం. ఉగ్రమూర్తి అయ్యాడు. వనజ మీద ప్రళయకోపం వచ్చింది. తన దగ్గర రెండో తాళపు చెవి ఉన్నప్పటికీ తాను వచ్చినట్లు తెలియజెయ్యాలనీ, అక్కడ ఆ మాధవరావు వున్నాడేమో చూద్దామనీ పార్వతమ్మగారింటికి వెళ్ళాడు చకచకా సుందరం. వసార్లోనుంచి పార్వతమ్మ కూతురు గౌరి చక్కగా సింగారించుకొని "ఏం మామయ్యగారూ, ఎప్పుడూ లేంది ఇలా వచ్చారు- అత్తయ్యగారి కోసమా? కాసేపు ముత్తయిదువులతో సరదాగా కూర్చోకూడదా?" అని నవ్వుతూ అంటుంటే సుందరాన్కి కోపం శాంతించి, తాపం ఉపశమించింది. గౌరి వంటరిగా వుంటే ఎన్నో మాటలు మాట్లాడాలనిపించింది సుందరానికి. ఇంతలోకి మూలగా రాసుకుంటున్న మాధవరావు లేచివచ్చి "ఇలా కుర్చీలో కూర్చోండి" అన్నాడు సవినయంగానే. కాని సుందరానికి వళ్ళు మండింది. దాంతో మళ్ళా వనజమీద కోపం పేత్రేగింది. 'మీ అత్తయ్యని తాళపు చెవి ఇవ్వమను' అన్నాడు గౌరితో. తాళపు చెవి తెచ్చి యిచ్చింది. వెంటనే ఇంటికి వెళ్ళిపోయాడు. డ్రస్సు మార్చుకొని వచ్చి తాళపు చెవి మళ్ళా గౌరికే ఇచ్చి వెళ్ళాడు చాలా కోపంగా.

తాను చేసింది భర్త చెప్పిందానికి వ్యతిరేకంగా వున్నా తప్పుమాత్రం కాదని వనజకు బాగా తెలుసు. పేరంటం అయ్యాక ఇంటికి వచ్చి వంటవండి భర్తకోసం నిరీక్షిస్తోంది. తనమీద సుందరానికి ఎందుకో అంత అనుమానం అని వనజకు సందేహం. ఆఫీసునుంచి పెందలకడే రావటంకూడా సి.ఐ.డి. ఉద్యోగానికే అని వనజకు తెలుసు. ఇటువంటి హీన మనస్తత్వం చూసి వనజ చాలా అసహ్యించుకుంది. దీనిని బట్టి సుందరం మనస్సులోనే అటువంటి చెడ్డభావాలున్నాయేమోనని వనజ అనుకుంటోంది. తన ఆఫీసు తాళపుచెవుల రింగులో ఇంటి తాళపు చెవి వున్నప్పటికీ పార్వతమ్మ గారింటికి ఎందుకు రావాలి భర్త? వచ్చి గౌరితో బాతాఖానీ ఎందుకు? తన్నే పిలవమనకూడదా? పోనీ, మళ్ళా ముస్తాబయి రావటమే! పైగా తన మీద అనుమానపడటం ఎందుకు? అనవసరంగా- ఇలా ఏవేవో ఆలోచించుకుంటూ కూర్చుంది వనజ. ఆ ఆలోచనలతోనే కునుకువచ్చింది. గడపమీద తల పెట్టుకొని పడుకుంది.

రాత్రి పదిన్నరయాక తిరిగి వచ్చాడు సుందరం. సుందరం కాళ్ళ త్రిప్పటకన్న బుర్రలో ఆలోచనల త్రిప్పట ఎక్కువగా వుంది. వనజ తలుపు తీసింది. ఇద్దరికి ఒకరిమీద ఒకరికి ఎక్కువ కోపంగానే వుంది. ఇద్దరూ కాసేపు మౌనంగా వున్నారు.

వనజే ధైర్యంతో "ఇంత పొద్దుపోయేదాకా ఎక్కడున్నారు?" అని ప్రశ్నించింది లోలోపల కోపంతో. ఈ ప్రశ్న అగ్గిమీద గుగ్గిలం మాదిరి అయింది సుందరానికి. వెంటనే "నోర్ముయ్! సిగ్గులేక ఆడదానివి నీవు తిరగొచ్చు, ఎదురు ప్రశ్న వేస్తున్నావే సిగ్గులేక" అన్నాడు అక్కసుతో.

వనజకు హృదయవేగం జాస్తి అయి- ''ఎక్కడికి పోయానండి, అలా కసురుతారు? ప్రక్కింటికి పసుపుకుంకానికి పోయాననేనా తప్పు?" అంది.

"బుద్ధిలేకపోతే సరి వంకలు" అన్నాడు.

"నాదేం వంకకాదు. నాకంత గతేం? మీదగ్గర తాళపుచెవి వున్నా ఆ వంక పెట్టుకొని మీరే వచ్చారు అక్కడికి" అని తీవ్రంగానే చెప్పింది.

"ఛా! నువ్వంటే నువ్వంటావు. ఆ వెధవని చూసేందుకుపోయి" అన్నాడు దొంగని కనిపెట్టినవాడిమాదిరి ధైర్యంతో.

వనజ ఆత్మాభిమానం దెబ్బతింది. వెంటనే "ముమ్మాటికి కాదు. ఆ మాటకొస్తే ముస్తాబయి మీరేవచ్చారు ఆ సింగారిని చూసేందుకు" అంది దెబ్బకు దెబ్బ యిచ్చినట్లు.

సుందరానికి పట్టరాని ఉక్రోషంతో చెప్పరాని కోపం వచ్చింది. తీవ్రంగా ముందుకు వెళ్ళి వనజ చెంపమీద చాచి ఒక దెబ్బ వేశాడు. వనజ గోడమీద పడింది ఏడుస్తూ. సుందరం గదిలోకి వెళ్ళిపోయాడు.

వనజ దుఃఖిస్తూ కొంతసేపు అక్కడే వుంది. వనజకు ఎప్పుడూ లేనిది ఆనాడు సుందరంమీద మొదట్లో కోపం వచ్చి ఎదిరించి జవాబు చెప్పింది.

ఎదిరించటం తనదే తప్పు అనుకొని పశ్చాత్తాప పడింది. కాని లోలోన రగుల్తున్న క్రోధాగ్ని మాత్రం తనను ఏమాత్రం భర్తకు లోను చెయ్యలేదు. ఇంతకీ తన తప్పు ఏమని తనను కొట్టినట్లు? వనజకు అర్థంకాలేదు. తనకు జ్ఞానంవచ్చాక ఏవరిచేతా దెబ్బతిని ఎరగదు. ఇలా ఎన్నో ఆలోచించుకుంది. స్త్రీకి భర్త మీద త్వరగా జాలి కలుగుతుంది. అది స్త్రీ హృదయం తీరు. భర్తకు అన్నం పెట్టవలసిన ధర్మం తనది. వనజ హృదయం జాలితో నిండిపోయి భర్త దగ్గరకు వెళ్ళింది. సుందరం పడుకున్న గదిలోకి వెళ్ళి నెమ్మదిగా జంకుతూ "లెండి, అన్నం తిని పడుకుందురుగాని" అన్నది.

సుందరానికి ఆ మాటలు కయ్యానికి కాలుదువ్వినట్లున్నాయి. తనకు అన్నం పెట్టేది యిది మాత్రమేనా అనుకున్నాడు. ఆ కోపావేశంలో "నీవు మింగు పోయి. నాకేం వద్దు పాడుకూడు. పెద్ద ప్రేమ విరగబడ్డట్టు పిలుస్తున్నావ్" అని చీదరించాడు.

ఈ మాటలు ఈటెల పోటుల మాదిరి గుచ్చుకున్నాయి వనజకు. తన హృదయం ఓర్చుకోలేకపోయింది. తనను హింసించినా, తూలనాడినా క్రోధాన్ని కుంగదీసుకువచ్చి జాలితో కోరితే పురుష హృదయం అది గ్రహించలేపోయినందుకు వనజలోని జాలి, శాంతి మాయమయ్యాయి తాత్కాలికంగా. ప్రతీకారంగా జవాబు ఇవ్వమని హృదయం స్పందిస్తోంది. "అవును- నన్ను చావకొట్టి మంచంమీద మహారాజులాగా శయనించే మీకుంది నామీద ప్రేమ- నిజమే, రెండు మూడేళ్ళయ్ సంసారం చేస్తున్నారు పాడు కాకపోతే ఏమిటి?" అనేసింది.

తన పురుషత్వానికే చెంపపెట్టనిపించాయి సుందరానికి యీ మాటలు. "ఛీ! అవతలకి ఫో!" అని గదిమాడు లేచి గభాలున కూర్చొని.

ఆమె ఆత్మగౌరవం దెబ్బతింది యీ మాటలకి. "ఎక్కడికి పొమ్మంటారు? పొమ్మంటే పోతాను- మీరే కులకండి బాగా-"

సుందరం రౌద్రమూర్తి అయ్యాడు. పట్టరాని కోపంతో లేచివచ్చి వనజను ఒక తన్ను తన్నాడు. ఆమె క్రింద పడింది. జుట్టు పీకాడు, చెంపలమీద కొట్టాడు, నెత్తిమీద మొట్టాడు, వీపుమీద గుద్దాడు. కొట్టి కొట్టి విసిగిపోయి "ఛీ! ఫో! నా మొహం చూడకు" అని కసిరి గదిలోంచి నెట్టివేసి పోయి పడుకున్నాడు.

చాలాసేపు బాధతో వెక్కి వెక్కి ఏడ్చింది వనజ. ఆ యింట్లో ఒక్క క్షణం వుండటం నీచమనుకుంది. అర్థంలేని అనుమానంతో కారణంలేని కలహం తెచ్చి చావచితకబాది పొమ్మన్న తర్వాతకూడా ఎందుకు వుండటం? పుట్టిల్లు కాకినాడకు బయలుదేరింది. తన దగ్గరవున్న కొద్ది పైకం, ఒక సంచిలో కొన్ని బట్టలు తీసుకొని సరాసరి స్టేషనుకు బయలుదేరింది. ఆత్మహత్య గూర్చి వనజకు గుర్తు వచ్చినా, అది చాలా చెడ్డది అనుకుంది. తనకు నెల తప్పిన మాట గుర్తుకు వచ్చి, ఆ ప్రయత్నం మహాపరాధం అనుకుంది. ఎలా జరుగనున్నదో అలా అవుతుందని ధైర్యం వహించింది.

సుందరం తన భార్య ఏమయిందీ తెలుసుకోవాలనుకోలేదు. తనకు ఇంత కోపం తెప్పించి ఇంత గొడవ చేయించిన దానిని బుజ్జగించేదేమిటి అని లోలోన చర్చించుకుంటూ నిద్రపోయాడు.

❀ ❀ ❀

విశాఖపట్నం నుంచి వనజ కాకినాడ చేరుకుంది. ఆమె రాక తల్లి శాయమ్మకీ, తండ్రి సీతాపతికీ చాలా ఆశ్చర్యం కలిగించింది. తమ్ముడు గోపాలానికి సంబరం ఎక్కువైంది. వారం కిందట అమ్మాయి నొకమారు పంపమని రాస్తే, ఇప్పుడు కాదని జవాబు రాసిన సుందరం యిలా పంపాడంటే ఏదో అనుమానంగా వుంది ఆ తల్లిదండ్రులకి. వనజ సర్ది చెప్పింది.

శాయమ్మ చాలాసార్లు అడిగినా చెప్పలేదు వనజ అసలు విషయం. ఎంతకాలం అలా దాచగలదు? ఒకనాడు అంతా చెప్పింది పొర్లి పొర్లి వచ్చే దుఃఖంతో. శాయమ్మ చాలా విచారించింది. సీతాపతి ఆత్మాభిమానంతో తాండవమూర్తి అయ్యాడు సుందరం మీద.

వనజ వచ్చి అప్పుడే నెలకావస్తోంది. వాడ అంతా ఏవో రహస్యాలు చెలరేగాయి. చిలవలు పలవలు అల్లి రకరకాల కథలు చెప్పుకోవటం ప్రారంభించారు అమ్మలక్కలు వనజను గురించి.

ఈ గొడవంతా చూస్తే వనజకు చాలా విచారం కలిగింది. దానికితోడు తల్లి శాయమ్మకి ఇది చాలా చిన్నతనంగా వున్నట్లు గ్రహించింది. కాని గత్యంతరంలేదు. పైగా ఇప్పుడు మూడో నెల. తిరిగి భర్త దగ్గరకు పోతే తప్పక తృణీకరించడమేగాక నీచపరుస్తాడు నలుగురిలో.

సీతాపతికి మాత్రం వనజ అంటే పంచప్రాణాలు. స్త్రీ కాబట్టి శాయమ్మ ఇరుగుపొరుగు మాటల్తో కుంగిపోతోంది. సీతాపతి ఒకమాటు అల్లుడి దగ్గరకు వెళ్దామా అనుకున్నాడు. అయినా ముందుగా ఒక ఉత్తరం రాశాడు. దానికి జవాబే లేదు. దానితో సీతాపతి అల్లుడిదే తప్పు అని తేల్చుకున్నాడు. శాయమ్మ భర్తతో "ఆడపిల్లని కన్నవాళ్ళం మనమే తగ్గి ఉండాలండి. ఒకమాటు విశాఖపట్నం పోయి అమ్మాయి నీళ్ళుపోసుకున్న సంగతి అప్పి ఇప్పి చెప్పి రాకూడదండీ?" అన్నది.

"సిగ్గుండే మాట్లాడుతున్నావుటే- అమ్మాయి తలమీద బొడిపి చూశావా? అయినా వాడు నన్ను మాత్రం ఆదరిస్తాడని నమ్మకం ఏది- కాకపోయినా నాబిడ్డదేంతప్పుంట?" అన్నాడు గట్టిగా సీతాపతి.

భర్తకు మరీ కోపం వస్తుందేమోనని జంకుతూ, జంకుతూ శాయమ్మ "అదికాదండి- మనం మెదలకుండా వూరుకుంటే రెండో పెళ్ళి చేసుకుంటాడేమో" అన్నది నెమ్మదిగా.

నిజంగానే మండిపడ్డాడీమాటవిని. "చేసుకోనీ- నా బిడ్డ నాకు బరువా? సీతాపతి కావలిస్తే దానిపేర అయిదెకరాలు రాసిస్తాను. బంగారంలా బ్రతుకుతుంది,

పుట్టే పండువంటి కొడుకును పెట్టుకొని. అమ్మాయిచేత రాయించాను, నేనూ రాశాను ఉత్తరాలు- జవాబు రాస్తేగా- బెల్లం కొట్టిన రాయి మాదిరి" అని గర్జించాడు కోపంతో. కొంచెం ఆగి, "నా బిడ్డ బంగారం వంటిది. నిప్పుమాదిరి మా తల్లిని అనుమానిస్తాడా, వీడి చదువు వ్యర్థంగాను! గేదెలను మల్లేసే తెలివికూడాలేదు" అని హుంకరించాడు.

శాయమ్మ మారుమాట్లాడలేదు. ప్రక్కగదిలో వుండి ఈ సంభాషణ అంతా వింటున్న వనజ మనస్సులో పెద్ద తుపాను చెలరేగింది. అనేక ఆలోచనలు దొర్లిపోయాయి. అనేక దుఃఖపాత్రల ముందున్న తెర మాదిరి వుంది ఆమె వదనం. గంభీరం ఉట్టిపడుతోంది ఆ ముఖ కవళికలో. వనజ జ్ఞానాజ్ఞాన విచక్షణ కలది. ఆత్మాభిమానం విషయంలో ముమ్మూర్తులా తండ్రినే పోలింది. తన తల్లిని కూడా మెప్పించాలని ప్రయత్నించింది, కాని, తన భర్త జవాబు రాయందే తానేం చేస్తుంది?

ఆరాత్రి పడుకున్నా వనజకు నిద్రలేదు. తన భావి జీవిత కార్యక్రమాన్ని గూర్చి ఆలోచిస్తోంది. ప్రసూతి అయిన నెల పిమ్మట ఆ యింటిలో ఉండకూడదని నిశ్చయించుకుంది. తనమూలాన తన తల్లిదండ్రులకు చిన్నతనంగా వుండటం ఆమె భరించలేకుండావుంది. ఎక్కడికి పోవటమా అనేది ఆమెకు పెద్ద సమస్యగా లేదు. మహానగరాలు, పట్టణాలు, పల్లెసీమలు వుండే విశాలదేశంలో ఎక్కడైనా చివరకు భిక్షాటనం చేసుకునైనా జీవించవచ్చు అనుకుంది.

❀ ❀ ❀

వనజ సుఖప్రసూతై ఇరవై రోజులు దాటింది. మగబిడ్డ. పండువంటి శరీరం, బొద్దుగావున్న వొళ్ళు - చాలా ముద్దొస్తున్నాడు. వనజ తన కార్యక్రమానికి నాందిగా తన బంగారు గాజులమ్మించి డబ్బు జాగ్రత్త చేసుకుంది.

ఆనాడే వనజ ప్రయాణం కావలసి వుంది. తనకి తప్ప మరెవ్వరికీ తెలియదు. తెలియకూడదు. చాలా ఖంగారుగానే వుంది వనజకి. కాని ధైర్యాన్ని చిక్కబట్టుకొంది. కుంటుంబగౌరవాన్ని కాపాడి, తన మానాన్నీ, ప్రాణంతో సమానమైన పసివాడినీ కాపాడుకోవాలి. భవిష్యత్తులో ఇదే వనజ ఆదర్శం. కొద్ది బట్టలుమాత్రం ఒక సంచిలో జాగ్రత్త చేసుకున్నది.

"నాన్నగారికి - కుమార్తెగా, భార్యగా, తల్లిగా నా ధర్మం నాకు బాగా తెలుసుననుకుంటాను. విధివ్రాత ప్రకారం ఆ ధర్మాన్ని నిర్వహించేందుకే మీదగ్గర సెలవు తీసుకుంటున్నా. ఎక్కడో జీవించే వుంటాను. అన్యథా భావించకండి. సమాజం అగౌరవం చూపిస్తున్నా మీరు ఆదరించినందుకు వేవేల వందనాలు.

మీ కుమార్తె వనజ"

అని చీటీ రాసి టేబిలుమీదపెట్టి ఎవ్వరికీ తెలియకుండా వెళ్ళిపోయింది కొడుకును తీసుకొని.

మదరాసు మెయిలు మహాజోరుగా పోతోంది. స్త్రీల పెట్టిలో వనజ కూచొని తన చిన్నారిని చూస్తూ భావి జీవిత స్థితినిగూర్చి ఎవ్వో కలలుకంటోంది.

ఏలూరుస్టేషను వచ్చింది. ఎవ్వరో ఒకామె చాలా సామానులతో ఆ పెట్టిలో ఎక్కింది. వనజ పాపకు పరచిన పక్కను తీసివేసి ఆమె కూర్చొనేందుకు జాగా యిచ్చింది. ఆమె వనజవైపు కృతజ్ఞతాపూర్వకంగా చూసింది. వనజను చూసిన వెంటనే ఆమెకు ఎందుకో గొప్ప అభిమానం ఏర్పడింది. వనజ చేతిలోని బిడ్డే కారణం కావచ్చు. పైగా వనజ ముఖంలో నృత్యం చేస్తున్న భావ సంచయాన్ని ఆమె గ్రహించగలిగి వుండాలి. అందాలుచిందే ఆ బిడ్డని చూస్తుంటే బిడ్డలులేని ఆమె 'ఆ బిడ్డ-నా బిడ్డే అయితే ఈపాటికి ఎన్నిసార్లు ఆ పాలబుగ్గల్లోవున్న అమృతాన్ని ఆస్వాదించేదాన్నో' అనుకుంటూ వనజను పలకరించకుండా వుండలేకపోయింది. ఆమె సంస్కారంగల స్త్రీ. విద్యావంతురాలు. ఆదరణ ఆమెకు బాల్యంనుంచీ వున్నదే.

"ఏ వూరు వెళ్తున్నారు?" అంది ఆమె నెమ్మదిగా.

"మదరాసు" అని వనజ జవాబిచ్చింది బరువైన హృదయంతో.

"మేమూ అక్కడికే లెండి... ఎక్కడినుంచి వస్తున్నారు?" అన్నదామె.

"కాకినాడ నుంచి" అని తలపైకెత్తి ఆమెవంక చూసింది, తన కథంతా చెప్తున్నట్లు.

"చంటివాడితో ప్రయాణం చేస్తున్నారు. మగవారు కూడా వస్తున్నారా వెంట?" అని కుతూహలంతో ప్రశ్నించిందామె. చిరునవ్వు తొణికిసలాడింది వనజ పెదవుల మీద. బిడ్డ వంకచూస్తూ "ఆ... వీడే మగవాడు" అన్నది.

ఇద్దరూ కలిసి వాడి వంక చూసి నవ్వుకున్నారు. కాని వనజ నవ్వు క్షణంలో మాయమైపోయింది. బిడ్డను ఆమె తీసుకొని తనివితీరా ముద్దులాడుతూ ముల్లోక సౌఖ్యాల్లో మునిగి తేలుతూన్నట్లు భావించి ఆమె తెలియకుండానే "ఈ బిడ్డను నాకు ఇవ్వకూడదు, మీకు పుత్రదాన ఫలం ఉంటుంది- ఈ బిడ్డ తమ్ముణ్ణి కనవచ్చు మీరు" అన్నది భిక్షకోరే ఆమెవలె.

"తప్పకుండా తీసుకోండి- అంతకన్న మహోపకారం నాకేంకావాలి? కాని పసివాడిని పెంచే దాదిగా నన్నూ మీతో తీసుకు వెళ్ళండి" అన్నది వనజ గంభీరమైన భావం ప్రకటిస్తూ.

"ఆ! ఎంతమాటన్నారు. నన్ను పరిహాసం చేస్తున్నారు. గొప్ప వంశపు కళలు ఉట్టిపడుతున్నాయి మీ కళ్ళల్లో- దాది అంటారా?" అన్నది కొంచెం విచారం చూపిస్తూ.

"వంశం గొప్పది కావచ్చు. మనస్సు మహత్తరమైనది కావచ్చు, కాని కాలం కఠోరమైందయితేనో?" అన్నది వనజ.

"చాలా బాగా అడిగారు- ఆ సమస్యనే నేను రాసిన స్క్రిప్టుకి ఆధారంగా తీసుకున్నాను" అన్నది ఆమె.

"సినిమా కథ రాశారా- పేరేమిటి, ఫిలిమ్ తీస్తారన్న మాట!" అని ప్రశ్నించింది వనజ.

"అవును. మావారే ప్రొడ్యూసరు, డైరెక్టరూకూడా. కథ నేనే రాశాను... పేరు 'అనుమానం' అని పెడదామనుకుంటున్నాను" అని చెప్పింది ఆమె.

వారి సంభాషణలో ఒకరి పూర్వోత్తరాలు ఒకరు తెలుసుకున్నారు. ఆమె పేరు కళ్యాణి. వనజ గత చరిత్ర విని కళ్యాణి చాలా బాధపడింది. కాని ముమ్ముందు తన యింట ఒకబిడ్డ కెవ్వుమన్నది వినిపిస్తుందనుకొని సంతోషించింది కళ్యాణి. కాకతాళీయంగా ఈ గొప్ప సహాయానికి కృతజ్ఞతను తెలియజేసుకుంది వనజ.

వనజలో మాతృత్వం మూర్తీభవిస్తూంది. అంత చిన్న వయస్సులో అంత గాంభీర్యం ఉండటం చాలా అరుదు. వనజ మనఃపూర్వకంగా అంగీకరిస్తే ఆమెను తన సినిమాలో నాయకిగా ప్రవేశపెట్టి వెండితెరమీద మాతృత్వాన్ని అమోఘంగా ప్రకటించగల అవకాశం ఇవ్వాలని కళ్యాణి లోలోపల అనుకుంది. కాని దీనిలో ఆమె స్వార్థం మాత్రం లేదు. ఫిలిం రంగానికి మరింత పవిత్రత నాపాదించాలని మాత్రం ఆమె వాంఛ. సమయం చూసి నొప్పించకుండా ఒప్పించాలనుకుంది కళ్యాణి.

వారు చాలా హాయిగా ప్రయాణం చేశారు. కళ్యాణి భర్త వనజ సంగతి తెలుసుకొని పుత్రుని ఇచ్చిన దేవతగా కొనియాడాడు. అవును, బిడ్డలు లేనివారి బాధ తీరిందిగదా! అందరూ కళ్యాణి భవనానికి వెళ్ళారు.

❀ ❀ ❀

కళ్యాణి ఇంట్లో వనజ చాలా కలివిడిగా వుంటోంది. కళ్యాణితో ఏర్పడిన ఆదర్శమైత్రి వలన కళ్యాణి కోరికను కాదనలేకపోయింది. సినిమాలో నటించాలని, డబ్బుతో తులతూగాలని వనజకు ఏమాత్రం ఇష్టంలేదు. కళ్యాణి చేసిన ఉపకారం గుర్తుంచుకుంది వనజ. అందువలననే నాయకి పాత్ర వహించేందుకు అంగీకరించింది. అదీకాక ఆ పాత్రలో చాలా ప్రత్యేకత గోచరించింది వనజకు. తన యథార్థ జీవిత గతికి ఆ పాత్రకి దగ్గర సంబంధం చూడగలిగింది. నటన ఇదివరకు తెలియకపోయినా సులభంగా గ్రహించే శక్తి గలది వనజ.

ఫిలిం దాదాపు పూర్తయిపోయినట్లే. వనజ చాలా గంభీరంగా, ఆదర్శంగా నటించింది. వనజ ప్రత్యుపకార బుద్ధిని కళ్యాణి కొనియాడింది. రిలీజుకు సిద్ధంగా వుంది ఫిలిం. పేరు 'అనుమానం' అనే ఖాయం చేశారు. వనజకు కళ్యాణి కొంత డబ్బు ముట్టజెప్పింది వద్దన్నా.

అయితే, వనజకు మానసికంగా మహత్తర పరిణామం వచ్చింది. ఆమెకు భావి జీవితానికి ఎట్టి ఆదర్శం, ప్రయోజనం కనిపించలేదు. భర్త ఎడబాటుగా ఇతరచోట

ఉండటంవల్ల లోకం కళంకం ఆపాదిస్తుంది. తన వంశానికి బీజంగా కొడుకు కేశవ భాగ్యవంతుల పంచ చేరగలిగాడు. కేశవ ఎక్కడున్నా తన కొడుకే. ఇంకా తాను ఎందుకు జీవించి ఉండాలో అర్థం కాలేదు. కాని, తన భర్తకి కొంత ఆర్థిక సహాయం చేసి భర్త పాదాల దగ్గరే ప్రాణం విడిచి శీలవతినని రుజువుచేసుకోవాలని ఆమె నిశ్చయించుకొంది.

ఇంక వెళ్ళిపోతాను అనే భావాన్ని కళ్యాణితో చూచాయగా చెపుతూనే వుంది. 'కేశవ నీ కొడుకే' అని ఎన్నోసార్లు చెప్పింది వనజ కళ్యాణితో. కళ్యాణికి కేశవ అంటే అమిత ప్రేమ. తమ ఫిలింకంపెనీకి 'కేశవ పిక్చర్సు' అనే పేరు పెట్టారు.

వనజ తన వుద్దేశాన్ని ఖాయం చేసుకుంది. ఆ రాత్రే విశాఖపట్నం వెళ్ళేందుకు నిశ్చయించుకుంది. పగలల్లా కేశవను వదలలేదు. చాటుగా ముద్దాడి ఏడ్చింది. కడసారి తను కన్న కేశవను చూసి ఒక చీటీ దగ్గర పడేసి వెళ్ళిపోయింది వనజ. కళ్యాణి పనిమీద వెళ్ళి తొమ్మిదింటికి తిరిగి వచ్చింది. కేశవ దగ్గర వనజ లేదు. "కేశవ నీ బిడ్డ. నా జీవితానికి భావిలో ప్రయోజనంలేదు. అందుకని వెళ్ళిపోతున్నా. చెప్పకుండా వెళ్ళటం మీరు ఆటంకం పెడతారనే. క్షమిస్తారుకదూ! కేశవ కళ్యాణి ముద్దుబిడ్డ."

కృతజ్ఞురాలు వనజ.

కళ్యాణి, ఆమె భర్త ఇది చూసి చాలా విచారించారు. కేశవను ఒళ్ళోకి తీసుకొని కన్నీరు కార్చారు.

వనజ విశాఖపట్నంలో దిగింది. కళ్యాణి యిచ్చిన సొమ్ము తాలూకు మూడువేల రూపాయలకు తన భర్త పేర చెక్కు రాసి, ఒక ఉత్తరం కూడా పెట్టి కవరు అంటించింది. తన అంతిమ యాత్రకి కావలసిన సన్నాహాలు చేసే వుంచింది.

బాగా చీకటి పడిన తర్వాత ఇంటికి బయలుదేరింది. తలుపులోపల గడియ వేసివుంది. లోపలనుంచి ఏవో మాటలు వినిపిస్తున్నాయ్, తన భర్త, మరెవరో స్త్రీ - బహుశః రెండో భార్య అయి వుండవచ్చు. వనజ తలుపు దగ్గర నుంచున్నది.

"అదేమండీ! 'అనుమానం' సినిమాకి తీసుకొని వెళ్ళి సగంలోనే ఇంటికి లాక్కొచ్చారు" అంది ఆ స్త్రీ.

"పోనిస్తూ పాడు ఫిలిం- తలనొప్పిగా వుంది" అన్నాడు సుందరం.

"అవును, అలాగే నొప్పిగా వుంటుంది. అనుమానం వున్న భార్యను శీలవతి అని రుజువు చేస్తుంటే నామర్దా కాదూ, అనుమానం పడ్డ మగధీరులికి" అన్నది ఆ స్త్రీ ఛలోక్తిగా.

"మహాపెద్ద క్రిటిక్కులాగా చెప్పొచ్చావుకాని" అన్నాడు సుందరం.

"ఆహా! ఎంత బాగా యాక్టు చేసిందండీ! ఆమెలో మాతృత్వం ఎలా మూర్తీభవించిందో?" అని పొగడుతోంది ఆమె.

"ఆ సోది మానెయ్యి" అని గర్జించాడు సుందరం.

వనజ తలుపు తట్టింది గబగబా పెద్ద శబ్దం చేస్తూ. సుందరం, ఆ స్త్రీ పరుగున వెళ్ళి తలుపు తీశారు... వనజ గభాలున సుందరం కాళ్ళమీద ఆ కవరు పడేసి తల ఆనించింది. ఒక్కమారు పైకిచూసి శాశ్వతనిద్రకు ఉపక్రమించింది - ఆమె పక్కనే పగిలిన చిన్న సీసా వుంది, దానిమీద 'విషం' అని రాసివుంది.

('ఆంధ్రమహిళ' మాసపత్రిక - 1955 ప్రాంతం)